క్లుప్తంగా

మాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాత, నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప మాలధారులకు గురువారం అన్నదాన కార్యక్రమాన్ని బద్రిగౌడ్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో 450 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, బర్మావత్ సీతారాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, రంగా, నాగరాజు తదితరులు ఉన్నారు.

పోలీస్ అధికారికి, ఎమ్మెల్యే మధ్య స్వల్ప వాగ్వాదం

హుజూర్‌నగర్ : పట్టణంలోని వీవీఎం స్కూల్‌లో పోలింగ్ బూత్ వద్ద ఓ పోలీస్ అధికారికి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సైదిరెడ్డిల మధ్య గురువారం స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. మెడలో గులాబీ కండువా వేసుకుని పోలింగ్ బూత్‌లోకి వెళ్తున్న సైదిరెడ్డిని కండువా తీసి వెళ్లాలని పోలీస్ అధికారి కోరారు. కండువాపై ఎలాంటి గుర్తులు లేవని ఎమ్మెల్యే పోలీస్ అధికారికి సమాధానమిచ్చారు. ఈ విషయమై ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఇతరులు సర్దిచెప్పడంతో వివాదం ముగిసింది.

పోలింగ్ కేంద్రంలో యువకుడి సెల్ఫీ వీడియో

- కేసు నమోదు చేసిన పోలీసులు

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో ఓ యువకుడు ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీశాడు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకొచ్చి సెల్ఫీ వీడియో తీయడం పట్ల అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఒకరి పేరుపై మరొకరు ఓటు



రావిపహాడ్‌లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు

మోతె : మండలంలో ఏర్పాటు చేసిన 48 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఓటర్లు తమ ఓట్లు వినియోగించుకున్నారు. పోలింగ్ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మందకొడిగానే జరిగింది. రావిపహాడ్‌లోని 2, 3 నంబర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. ఇదిలా ఉండగా నామవరంలోని 36వ పోలింగ్ కేంద్రంలో కొమ్మ లింగమ్మ భర్త లింగయ్య అనే మహిళా ఓటరుకు బదులుగా కొమ్మ లింగమ్మ భర్త చిన్నాయన అనే మరో మహిళా ఓటర్ స్లిప్ లేకుండానే ఓటు వేసింది. దీంతో కొమ్మ లింగమ్మ భర్త లింగయ్య ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లగా లింగమ్మ పేరున ఓటు వేసినట్లు ఓటరు లిస్టులో ఉందని పోలింగ్ సిబ్బంది తెలిపారు. దీంతో ఆమె ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మూడోసారి అధికారంలోకి వస్తాం

తిరుమలగిరి : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ మూడవసారి అధికారంలోకి వచ్చి సీఎంగా కేసీఆర్ శాసనసభలో అడుగు పెడతారని తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్ కుమార్ అన్నారు. గురువారం తిరుమలగిరిలో ఓటు హక్కును వినియోగించుకున్న తరువాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న ప్రధాన ఆయుధం ఓటు హక్కు అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగర్ ఎడమకాలువలో జారిపడి వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): సాగర్ ఎడమకాలువలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. వరంగల్ జిల్లాకు చెందిన అజ్గర్ అలీ(48) భార్య షహనాజ్ సూర్యాపేట జిల్లా నడిగూడెం గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ వైద్యురాలిగా పనిచేస్తోంది. దీంతో అజ్గర్ అలీ కుటుంబం కొంత కాలంగా మునగాల మండలంలోని బరాఖత్‌గూడెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో అజ్గర్ అలీ తన కుమార్తెను తీసుకొని మునగాల శివారులోని సాగర్ ఎడమకాలువలో స్నానం చేసేందుకు వెళ్లాడు. కుమార్తెకు స్నానం చేయించి ఒడ్డున కూర్చోబెట్టి తనూ స్నానం చేసేందుకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో అజ్గర్ అలీ కాలుజారి కాలువలో పడి మునిగిపోయాడు. కుమార్తె కేకలు వేయడంతో పరిసర ప్రాంతానికి చెందిన రైతులు కాలువలోకి దిగి వెతకగా అజ్గర్ అలీ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.

ముగిసిన పోలింగ్

- పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల మొరాయింపు
- కొన్నిచోట్ల స్వల్ప ఘర్షణలు
- కోదాడ నియోజకవర్గంలో 85.44 శాతం
- హుజూర్‌నగర్‌లో 86.31 శాతం పోలింగ్ నమోదు



హుజూర్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన మహిళా ఓటర్లు



అనంతగిరిలో క్యూ లైన్‌లో నిల్చున్న ఓటర్లు

కోదాడ : కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గవ్యాప్తంగా 85.44 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,41,554 మంది ఓటర్లు ఉండగా వీరిలో 2,06,177 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1,18,039 మంది పురుష ఓటర్లు ఉండగా వీరిలో 1,00,966 మంది, 1,23,500 మంది స్త్రీ ఓటర్లలో 1,05,405 మంది, 15 ట్రాన్స్‌జెండర్‌లకు గాను ఆరుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

193వ బూత్‌లో ఈవీఎం మొరాయింపు

పట్టణ పరిధిలోని సీసీరెడ్డి కాన్వెంట్‌లోని 193వ బూత్‌లో ఉదయం ఈవీఎం మొరాయించడంతో గంటసేపు ఓటింగ్ నిలిచింది. పట్టణంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతగిరి రోడ్డులోని గ్రేస్‌వ్యాలీ ఐడియల్ పాఠశాలలో కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి, నల్గొండ ఎంపీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీనగర్‌కాలనీలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు తన ఓటు వేశారు. కాంగ్రెస్ నాయకులు పాండురంగారావు, ఎర్నేని బాబు, పారా సీతయ్యలు బూత్‌లలో పర్యటించి ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

86.31 శాతం పోలింగ్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 86.31 శాతం పోలింగ్ నమోదైనట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి గురువారం తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,47,592 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,13,702 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1,03498 మంది పురుషులు, 1,08,354 మంది మహిళలు, ఇతరులు 12 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. చింతలపాలెం మండలంలో 90.27 శాతం, గరిడేపల్లి 86.73 శాతం, హుజూర్‌నగర్ 84.41 శాతం, మఠంపల్లి 89.12 శాతం, మేళ్లచెరువు 85.57 శాతం, నేరేడుచర్ల 81.72 శాతం, పాలకవీడు మండలంలో 88.97 శాతం ఓట్లు నమోదైనట్లు ఆయన తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అభ్యర్థులు

పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. అంబేద్కర్ కాలనీలోని పాఠశాలలో పోలింగ్ కేంద్రం, 215 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు కొద్ది సేపు మొరాయించాయి. వెంటనే వాటిని సరి చేయడంలో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయమే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులు తీరారు. కొన్ని చోట్ల తోపులాటల సంఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు వారిని వారించారు. హుజూర్‌నగర్‌లోని 216 పోలింగ్ బూత్ లో 5గంటల తర్వాత కూడా దాదాపు 70 మంది ఓటర్లు ఉండటంతో పోలింగ్ దాదాపు 7 గంటల వరకు కొనసాగింది. కాగా, నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సైదిరెడ్డి



కోదాడరూరల్ : ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న జడ్జి శ్యాంసుందర్



మఠంపల్లి: గుండ్లపల్లిలో ఓటు వేసి సిరాగుర్తు చూపుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి



కోదాడ : ఓటు హక్కు వినియోగించుకున్న కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : ఓటు వేసిన స్వతంత్ర అభ్యర్థి సాంబశివగౌడ్



నేరేడుచర్లలో ఓటు వేసి సిరాగుర్తు చూపుతున్న బీఎస్‌పీ అభ్యర్థి రాపోలు నవీన్‌కుమార్

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన జడ్జి శ్యాంసుందర్

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని కొమరబండలో గల కేఎల్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కోదాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్యాంసుందర్ కొమరబండ బూత్ నెంబర్ 167లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

31, 140 ఓట్లు నమోదు

మునగాల : మండలంలోని 22 గ్రామపంచాయతీలలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో 86.89శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 35,837ఓటర్లు ఉండగా 31,140ఓట్లు పోలైనట్లు వారు పేర్కొన్నారు.

మొరాయించిన ఈవీఎంలు

మండలంలోని నేలమర్రిలో గల 51వ పోలింగ్ కేంద్రంతో పాటు తాడువాయిలో గల 54వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు మొరాయించాయి. రెండు కేంద్రాలలో కేవలం పది ఓట్లు వేసిన తర్వాత ఈవీఎంలు పనిచేయకపోవడంతో ఓటర్లు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సదరు అధికారులు గంట తర్వాత మొరాయించిన ఈవీఎంల స్థానంలో నూతన ఈవీఎంలను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను యథావిధిగా కొనసాగించారు.

పార్టీల నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ

చిలుకూరు : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో మండలంలో 83. 50 శాతం పోలింగ్ నమోదైంది. 38 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ ఓట్లు వేశారు. కాగా, ఆర్లెగూడెం పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎంలలో సాంకేతిక లోపం కారణంగా సుమారు అరగంట పాటు పోలింగ్ ఆగింది. చిలుకూరులో ఈవీఎం మధ్యాహ్నం సమయంలో ఆగిపోవడంతో మరో ఈవీఎమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. బేతవోలులో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ జరగడంతో పోలీసులు సద్దుమణిగించారు. బేతవోలు పోలింగ్ కేంద్రాన్ని కోదాడ డీఎస్పీ ప్రకాశ్ పరిశీలించారు. అలాగే బేతవోలు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ పరిశీలించారు. సాయంత్రం 5 గంటల తరువాత కూడా చిలుకూరులోని ప్రాథమిక పాఠశాల బూత్‌లో, ఆర్లెగూడెం, పోలేనిగూడెం, బేతవోలు పీఎస్‌లో 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హుజూర్‌నగర్ మండలంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. లక్కవరం, వేపలసింగారం గ్రామాల్లో ఉదయం 8 గంటలకే ఓటు వేయడానికి ఓటర్లు బారులు తీరారు.

ఓటు వేసిన స్వతంత్య్ర అభ్యర్థి సాంబశివగౌడ్

మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన దేశగాని సాంబశివగౌడ్ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కాగా గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో ఆయన బూరుగడ్డలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మొత్తం 29 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

మేళ్లచెరువు మండలంలో..

మేళ్లచెరువు : మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు లైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సైదిరెడ్డి పరిశీలించారు.

86.73 శాతం ఓట్లు నమోదు

గరిడేపల్లి : మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో 86.73 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ బండ కవిత తెలిపారు. కాగా, మండలంలోని వెలిదండలో ఇరు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకోగా, గడ్డిపల్లిలో స్వల్ప ఘర్షణ జరిగినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. వెలిదండ సంఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : మండలంలో మొత్తం 20745 మంది ఓటర్లకు గాను 18507 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సెక్టోరియల్ అధికారులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎస్సై లింగయ్య పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనంతగిరి మండలంలో..

అనంతగిరి : మండల వ్యాప్తంగా 19 గ్రామాల్లోని 33 పోలింగ్ బూత్‌లలో గురువారం అధికారులు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా సుమారు 75 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. అత్యధిక జనాభా కలిగిన గోండ్రియాల, శాంతినగర్, వాయిలసింగారం, అమీనా బాద్ గ్రామాల్లో 90 శాతం పోలింగ్ నమోదు అయింది.

పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

త్రిపురవరంలోని 159, 160 పోలింగ్ బూత్‌లలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బూత్‌లలోకి వెళ్లి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై అక్కడే ఉన్న పోలీస్ సిబ్బందికి మూడు సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఈవిషయంపై కాంగ్రెస్ నాయకులకు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న బీఆర్‌ఎస్ నాయకులను బయటకు పంపించడంతో వాగ్వాదం సర్దుమణిగింది.

గణపవరం, గుడిబండలో స్వల్ప ఘర్షణ

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని 16 గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకటి రెండు చోట్ల అతి స్వల్ప ఘర్షణలు మినహా అన్ని చోట్ల ప్రశాంతంగా జరిగింది. గణపవరంలో 243, 246 బూత్‌ల్లో కొన్ని ఓట్లు పోల్ అయిన తర్వాత ఈవీఎం మొరాయించడంతో సాంకేతిక నిపుణుడు మరమ్మతులు చేసిన అనంతరం పోలింగ్ ప్రారంభించారు. గణపవరంలో వృద్ధులు, వికలాంగులను మరొకరు ఓటు వేసేందుకు తీసుకెళ్తుండగా ఇరు వర్గాల వారు ఘర్షణకు దిగగా పోలీసులు వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు. తొగర్రాయి, గుడిబండలో పోలింగ్ కేంద్రాల వద్ద తమ తమ పార్టీలకు ఓట్లు వేయాలని గుర్తులను చెప్పడంతో అక్కడ కూడా స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. కూచిపూడిలోని 249 బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ నడిచింది. తొగర్రాయిలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ఓటు వేసిన బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని 26 పోలింగ్ కేంద్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన 43 పోలింగ్ బూత్‌లలో గురువారం ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కాగా, మండలంలోని కందులవారిగూడెం గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో ఎన్నికల పోలింగ్ ఉదయం ఆలస్యంగా ప్రారంభమైంది. చింతబండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్ బీఎస్పీ అభ్యర్థి రాపోలు నవీన్‌కుమార్ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



హుజూర్‌నగర్‌లో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్



కోదాడ : కరివిరాలలో ఓటు వేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లయ్యయాదవ్, ఆయన కుటుంబ సభ్యులు



కోదాడ : ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు



నేరేడుచర్లలో ఓటు హక్కు వినియోగించుకున్న హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి



కోదాడ : ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషాలక్ష్మీనారాయణ



హుజూర్‌నగర్ : వేటు వేసి సిరాగుర్తు చూపుతున్న శతాధిక వృద్ధురాలు



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..



చిలుకూరు : బేతవోలులో..



నడిగూడెం : కరివిరాలలో..



కోదాడ : స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలిస్తున్న సిబ్బంది



చిలుకూరు : ఆచార్యులగూడెంలో ఓటు వేసిన స్వాతంత్ర్య సమరయోధుడు కనకయ్య



మునగాల : ముకుందాపురం పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో నిల్చున్న మహిళలు



కోదాడ : ఓటింగ్ సమయం ముగియడంతో పోలింగ్ బూత్ గేట్ మూసివేస్తున్న సిబ్బంది



అనంతగిరి : ఓటు వేసేందుకు దివ్యాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న సిబ్బంది



గరిడేపల్లి: ఓటు వేసేందుకు బారులుదీరిన ప్రజలు



పాలకవీడు : జాన్‌పహాడ్‌లో..



హుజూర్‌నగర్‌లోని మోడల్ పోలింగ్ స్టేషన్



కోదాడరూరల్ : గుడిబండలో..



నేరేడుచర్ల : కందులవారిగూడెంలో ఈవీఎం మొరాయించడంతో మరమ్మతులు చేస్తున్న టెక్నికల్ సిబ్బంది



నడిగూడెం : కరివిరాలలో వృద్ధురాలిని ఓటు వేయించడానికి తీసుకొస్తున్న సిబ్బంది



మునగాల పోలింగ్ కేంద్రానికి దివ్యాంగుడిని ఎత్తుకొని వెళ్తున్న సహాయకుడు



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో స్టాండ్ సహాయంతో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధుడు



మునగాల : ముకుందాపురంలో 95 ఏళ్ల వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్తున్న సహాయకురాలు



మేళ్లచెరువులో తొలిసారి ఓటేసిన యువతులు